


***(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)***

**116**

**(20' జనవరి 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**"జీవితం చాలా చిన్నది.** ఏ ఘనకార్యం సాధించడానికీ చాలదు. సగం కోరికలన్నా తీరకముందే చరమ సంధ్య వచ్చి వాలుతుంది" అని ఒకాయన నిర్వచించాడు.

చాలామంది జీవితంలో సాధించదలచిన విజయాలు సాధించే అవకాశాలు తక్కువనీ, ఆయువు మాయగా దాటిపోతుందని విచారం వెలిబుచ్చుతున్నారు.

షష్టిపూర్తి దగ్గర పడ్డవాళ్ళు ఇంకొక్క షష్టిపూర్తి అయినా జరిగితే కొంతవరకూ కల తీర్చుకోవచ్చుననీ, లేకపోతే ఎటూ కాని స్థితిలో తలపెట్టిన కార్యక్రమాన్ని వదిలిపెట్టి పోవలసి వస్తుందనీ చింతిస్తూ ఉంటారు.

అసలు జీవితంలో సాధించదలిచిందేమిటి? అందరి ఆశయాలు ఒకటేగా? అందరికీ వాటిని తీర్చుకునే శక్తి సమానమేనా? అన్న ప్రశ్నలు వేసుకోక తప్పదు. ఇటీవల ఒకరింటికి వెళ్ళాం. ఆ వృద్ధ దంపతులతో మాట్లాడుతూ "ఏమిటి మీ జీవిత ఆశయాలు ఎంతవరకు నెరవేరినాయి?" అని ప్రశ్నించాం.

"మా ముఖం నెరవేరినాయి. ఒక వంతు అయినా నెరవేరలేదు. అయిదుగురు ఆడలిపిల్లల్ని, నలుగురు మగవాళ్ళనీ కన్నాం. ఆడపిల్లలకు ఇంకా ఇద్దరికి ముళ్ళు పడలేదు. మగవాళ్ళల్లో ఒకడికి పెళ్ళయింది. తక్కిన ముగ్గురూ తమ కాళ్ళ మీద తాము నిలబడేదాకా పెళ్ళి తలుపు పెట్టుకోమంటున్నారు.

"మూడు, నాలుగులకు ఎం.బి.బి.ఎస్ సీట్ల వేట ఇంకా అలానే వుంది. రెండోవాడు ఇంజనీర్ ప్యాసయ్యి ఇంట్లోనే ఉన్నాడు. పెద్దాడు ఎం.ఏ పాసయి ఎన్ని ప్రయత్నాలో చేసి చివరకు మెడికల్ ఏజెంటుగా చేరాడు. పెద్ద అల్లుడికింకా పర్మనెంటు కాలేదు, రెండో ఆయనకు ప్రమోషను దొరక్క కొట్టుకుంటున్నాడు. మూడో ఆయన సర్వీసు కమీషన్‌కు వెళ్ళాడు మొన్న."

"నాలుగో అమ్మాయి బి.ఏ ప్యాసయి టైపు నేర్చుకున్నది. అయిదొది సెప్టెంబరులో మెట్రిక్యులేషన్ ప్యాసయింది. అప్పటినుంచీ ఆంజనేయ దండకం చదువుతూ యింట్లోనే కూర్చుంటుంది. ఇదే మా చరిత్ర. ఏం తీసినట్లు? ఏం శాంతి లభించినట్లు?" అని దిగులుపడ్డారు ఆ యిద్దరు.

"కోరికలు తీరలేదన్నారు బాగానే వుంది. కానీ అసలు మీ ఆశయమేమిటి అన్నాను.

"పెద్ద ఆశలేం పెట్టుకోలేదు. ఎందుకొచ్చింది నెరవేరతాయా ఏమన్నానా? నేను ఇండియా ప్రధాన పదవికి ఆశించడంలేదు, మా వారు ఇండియా ప్రెసిడెంటు కావాలని అనుకోవడం లేదు."

"కన్న సంతానం అందరికీ కళ్యాణాలు కావాలి. అల్లుళ్ళూ, కొడుకులూ అందరూ గెజిటెడ్ ఆఫీసర్లు కావాలి. తలో ఇల్లూ కట్టుకుని తలో కారూ కొనుక్కుని చల్లగా కాలం గడిపితే అంతేనా అనుకుంటున్నాం. ఆశకు మాత్రం అంతువుండొద్దూ" అన్నదా ఇల్లాలు. ఎంతో వేదాంతాన్ని జీర్ణం చేసుకున్న వ్యక్తిలాగా.

"బాగానే వుంది. కానీ మీ స్వంతాన్ని గురించి ఏం ఆలోచించారు?" అన్నాను.

"ఇందులో స్వంతం పరాయి అంటూ ఏం వుంది? అంతా ఒకటే" అన్నాడాయన.

"అసలు స్వంతమంటూ ఏం వుంటుందండీ ఈ లోకంలో. అయితే పరాయి బ్రతుకులు వట్టి కిరాయి నాటకాలు, మమకారాలు వట్టి ఇత్తడి కిరీటాలు, గారాబాలు వెలిసిపోయె తురాయీలు ఇలాంటి స్థితిలో మనం స్వంతానికి ఏదైనా కొంచెం ఆలోచించుకోవాలి కదండీ" అన్నాను.

"మన ఆలోచనలు సాగుతాయా? పరం విషయంలో ఎలాంటి హామీ లేదు. ఇహంలో మన సంతానం ఇబ్బంది పడకుండా జీవించే సదుపాయాలు కల్పిస్తే అది పరమ వేదాంతం క్రిందనే జమపడుతుంది. వారికి 'అదనపు జనాభా' క్రింద జమకట్టి పోతే ఎలా చెప్పండి" అన్నాడాయనగారు.

చాలామంది ఇలా ఐహికాల మీద మోజులు నెరవేర్చుకోవడం కోసమే జీవితాన్ని కుళ్ళినా, పండినా, ఎండబెట్టి మామిడి తాండ్రలాగా తయారుచేసి మళ్ళీ బేరం పెడుతూ ఉంటారు పాపం?

మా బంధువుల్లో ఒకాయన ఎలాగో తంటాలు పడి వంద ఎకరాల పొలం ఒక్కచోటే సంపాదించారు. కానీ ఎంతమాత్రం తృప్తి పడలేదు. "ఏమిటి మామా నీ బాధ?" అని ప్రశ్నిస్తే - "బాధ కాదుట్రా మన పొలమంతా ఒక్కచోటే ఉంది. అందులో ఒక మూల ఆరెకరాలొకడికి ఉంది. ముప్పయివేలిస్తా వదిలిపొమ్మన్నా వాడు వదలడం లేదు. అది కూడా వస్తే ఏక ఖండం.. ఏక ఖండం" అనేవాడు

ప్రపంచశాంతి, భద్రతకూ అమితమైన త్యాగాలు చేసిన మహనీయులెందరో అఖండ కీర్తి గడించి వారి పేరు మానవచరిత్రలో సువర్ణాక్షరాలతో సుస్థిరం చేసుకుంటే మా బంధువు ప్రక్కవాడి అరెకరం కూడా కొని ఏకకండ ఖ్యాతి గడించాలని జీవితమంతా తపస్సు చేస్తూ వచ్చాడు.

ఏం చెపుదాం? ఎవరి ఆశయాలేమిటో? ఆయా వ్యక్తుల్నిబట్టి ప్రవృత్తులు మారుతూ ఉంటాయి. కొన్ని చిలిపితనానికి పోతే కొన్ని చిద్విలాసానికి పోతూ ఉంటాయి. 'రామా రామా' అంటూ కొందరు కన్నుమూస్తే 'ప్రేమా, ప్రేమా' అంటూ కొందరు తనువు చాలిస్తారు. కొందరు 'హరీ హరీ' అంటూ అవతారం చాలిస్తే కొందరు ' సిరి..సిరీ' అంటూ జీవితం చాలిస్తారు. ఎవరి ఆశయాలు ఎంతవరకు ఫలించుతూ ఉంటాయో ఎలా చెప్పడం?

మా చిన్నప్పుడొక కథ చెపుతూ ఉండేవారు. మాకు దగ్గరగా వున్న ఒక ఊర్లో ఒక రాజుగారుండేవాడు. ఆయనగారికి నాటకాల పిచ్చి అధికం. ఆ రోజుల్లో నాటకాలలో చేరడమంటే అతి హేయంగా చూచేవారు. అందువల్ల ఆ అల్లరి పడలేక ఆయన భార్య పుట్టింటికి వెళ్ళిపోయింది. పాపం ఆయన ఇటు నాటకాలమీదా, అటు భార్య మీదా అభిమానం పోగొట్టుకోలేక సతమతమవుతూ ఉండేవాడు. కొన్నాళ్ళకు నాటకాలు మానేశాడు. భార్యను రమ్మని కబురు పంపాడు. కానీ, 'వెనుకటి అల్లరి చాలు, నేను రాను' అని ఆమె గట్టిగా చెప్పేసింది.

కానీ ఆయన జీవితమంతా "ఆవిడ తిరిగి రావాలి ఎగిరి నా యింట్లో వాలాలి" అని తపిస్తూ జపిస్తూ జీవితం వెళ్ళబుచ్చుకున్నాడు. కొందరిలా వున్న సంపదల్ని పోగొట్టుకుని, వాటికోసం తిరిగి అలమటిస్తూనే పరలోకం చేరడం జరుగుతూ ఉంటుంది.

జీవితాశయాలు నెరవేరడమనేది చాలా సందర్భాలలో సాధ్యంకాని పని. గాంధీజీ భారతదేశ స్వాతంత్ర్యం తన ఆశయంగా పెట్టుకోలేదు. రామారాజ్య స్థాపనే ఆయన మహదాశయం. అది ఆయన జీవించి ఉండగానూ నెరవేరలేదు, తర్వాత కూడా యింత వరకు అలాటి ప్రయత్నాలు జరగడంలేదు. కానీ, ఆయన "హరే రామ్', హరే రామ్" అంటూ మరణించారు.

విలియం పిట్ మరణించేముందు "నా దేశం, నా దేశం" అంటూ అరచి ప్రాణాలు వదిలాడట. సిసిల్ రోడ్సు తన ఆశయం నెరవేరలేదన్న విచారంతో మరణించే ముందు "చేసింది తక్కువ, చెయ్యవలసింది ఎంతో వుంది" అనే నైరాశ్యం వెలబుచ్చాడుట.

మహనీయుడు మహత్తరమైన ఆశయాలతో జీవిస్తారు. వాటిని గురించి కలలు కంటూనే మరణిస్తారు. స్వార్థపరులు, లుబ్ధులు, సంకుచిత హృదయులు ఎండమావుల్లో పరుగెత్తి పరుగెత్తి ఎక్కడో తూలిపడిపోతారు. వారి ఆశయాల వారితోనే నశిస్తాయి. అంతేకాదు, అలాంటి అసాధ్యమైన ఆశయాలు వారిని శపిస్తాయి చివరి కాలంలో.

Post your comments